క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: పేద ప్రజలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన రేణుక అనారోగ్యంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యఖర్చుల నిమిత్తం స్థానిక కార్పొరేటర్ సౌందర్య విజయ్, ఎమ్మెల్యే సహకారంతో వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డి రేణుక భర్త రాములుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

హుడాకాంప్లెక్స్: ఈ నెల 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్ మాట్లాడుతూ.. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు మూసివేతను ఆపాలని, ఐఐటీ ప్రవేశాల్లో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని, యూనివర్సిటీల్లో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని, విద్యార్థులు, విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ బంద్ చేస్తున్నామని వివరించారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న అంజయ్య

కందుకూరు: కందుకూరు లయన్స్ క్లబ్‌కు చెందిన తాళ్ల అంజయ్య జిల్లా అడిషనల్ క్యాబినేట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. 18 సంవత్సరాలుగా కందుకూరు క్లబ్ తరపున సేవలందిస్తూ జిల్లాస్థాయిలో రాణించడం అంజయ్య సేవలకు నిదర్శనమని మహేంద్రకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. 2024–25 సంవత్సరానికి గాను ప్రస్తుత జిల్లా గవర్నర్ డి.కోటేశ్వరరావు, అంజయ్య సేవలను వినియోగించుకునేలా పదవీ అప్పగించాలని సూచించారన్నారు. కాగా తనకు పదవీ రావడానికి కారణమైన వారందరికి ఈ సందర్భంగా అంజయ్య ధన్యవాదాలు తెలిపారు. జిల్లాస్థాయిలో తన సేవలను మరింత విస్తృతం చేస్తానన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హస్తినాపురం: ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలోని శివాలయం వద్ద కామినేని ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో బిజ్జాల వేణు గుప్తా, బండ్ల సుధాకర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ తూర్పు జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ, నాగార్జున కాలనీ, వెంకటరమణ కాలనీ, మల్లికార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో ఆయన జోనల్ కమిషనర్‌ను కలిశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు హరీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నవీన్, నిరంజన్ పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో అక్షరాభ్యాసం

హస్తినాపురం : హస్తినాపురం డివిజన్ పరిధిలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్యూల, పాఠశాల డీన్ ప్రమీల, డీఈ‌ఓ క్రాంతి కుమార్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్వాన దారి.. ప్రమాదకరంగా మారి!

గుంతల రోడ్డుతో నిత్యం అగచాట్లు

- తీవ్ర అవస్థలు పడుతున్న మాన్యగూడవాసులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వర్షాలతో చిత్తడిగా మారిన మాన్యగూడ రహదారి



రహదారికి ఇరుపక్కలా కంప చెట్లతో ఇలా..

కందుకూరు: ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ రహదారి అభివృద్ధిని మాత్రం పట్టించుకునేవారే కరువయ్యారు. రహదారి గుంతలమయమై చుట్టూ కంప చెట్లతో అధ్వానంగా మారడంతో అటు గ్రామస్తులతో పాటు ఇటు రైతులకు తిప్పలు తప్పడంలేదు. వర్షాకాలంలో సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. గుంతల్లో నీరు నిలిచి ఛిద్రంగా తయారుకావడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఇదీ మండల పరిధిలోని మాన్యగూడ గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి.

చుట్టూ తిరుగుతున్నారు

నేదునూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మాన్యగూడ గ్రామానికి మండల కేంద్రం నుంచి నేరుగా వెళ్లే 2.5 కిలోమీటర్ల మేర ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో నేదునూరు మీదుగా చుట్టూ కిలోమీటరన్నర అదనంగా తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది గ్రామస్తులకు. గుంతలమయంగా ఉన్న రోడ్డు వెంబడి కంప చెట్ల ఉండటంతో పగలు కూడా ప్రయాణించాలంటేనే హడలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ గ్రామంతో పాటు నేదునూరుకు చెందిన రైతుల పొలాలన్ని అధికంగా ఆ రహదారి వెంబడే ఉన్నాయి. దీంతో తప్పనిసరిగా ఆ రహదారి గుండా ప్రయాణించాల్సిందే. వర్షాకాలంలో సాకలోనిబాయి వాగు నుంచి వచ్చే నీరు రోడ్డుపై ప్రవహించడంతో మరీ ఇబ్బందిగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

దగ్గరి దారితో ప్రయాణం సులువు

రహదారిని అభివృద్ధి పరిస్తే మాన్యగూడతో పాటు ముక్కిడివాగుతండా గిరిజనులకు ఆ పైనున్న దాసర్లపల్లి గ్రామస్తులకు మండల కేంద్రానికి చేరుకోవడానికి దగ్గరి దారి అవుతుంది. కాగా దాసర్లపల్లి నుంచి మాన్యగూడ వరకు ఉన్న రహదారిని గతంలో బీటీగా మార్చారు. మాన్యగూడ నుంచి ఉన్న మిగతా రహదారికి కూడా నిధులు మంజూరు చేస్తే ఆపై గ్రామాలతో పాటు కడ్తాల్ మండల పరిధిలోని మాదారం, రాయిచేడు తదితర గ్రామాలతో అనుసంధానం సులభతరమవుతుంది. మండల కేంద్రంతో పాటు హైదరాబాద్‌కు చేరుకోవడానికి దగ్గర దారి అవుతుంది. అధికారులు స్పందించి ఆ రహదారికి నిధులు మంజూరు చేయించి నిర్మాణాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం

మాన్యగూడ గ్రామానికి నేరుగా వెళ్లే మార్గం మట్టి రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి ఇబ్బందిగా ఉందనే విషయాన్ని గుర్తించాం. గతంలో మా ముందు పని చేసిన అధికారులు ఒకసారి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. నిధులు మాత్రం మంజూరు కాలేదు. మళ్లీ మరోసారి ప్రతిపాదనలు పంపుతాం.

– సతీష్‌రెడ్డి, ఏఈ(పీఆర్), కందుకూరు

ఆశల సమస్యలు పరిష్కరించాలి

మీర్‌పేట: ఆశవర్కర్లకు పనిభారం తగ్గించి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, శేఖర్‌యాదవ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బాలాపూర్ మండల కమిటీ ఆశవర్కర్లతో మీర్‌పేటలోని పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యాదయ్య, మండల ఆశవర్కర్ల అధ్యక్షులు భాగ్యలక్ష్మి, లీలావతి, సుజాత, రాణి, వరలక్ష్మి, రజిని, అనిత, బాలమణి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



ఆశవర్కర్లతో కలిసి మాట్లాడుతున్న నాయకులు

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు

కందుకూరు: పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో చైర్మన్ డి.చంద్రశేఖర్ అధ్యక్షతన మహేశ్వరం ఏడీఏ ఎం.సుజాత ఆధ్వర్యంలో రైతుభరోసా అంశంపై సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, డైరెక్టర్లు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. పది ఎకరాల వరకు రైతు బంధు ఇవ్వాలని కొందరు, 20 ఎకరాల వరకు ఇవ్వాలని కొందరు, ఉపాధిహామీ పథకంతో అనుసంధానించి రైతుభరోసా అమలు చేయాలని కొందరు, సాగు చేసిన పొలానికే ఇవ్వాలని మరి కొందరు రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. గతంలో వెంచర్లకు కూడా రైతుభరోసా ఇచ్చారని, అటువంటివి పరిశీలించి తొలగించాలని కోరారు. వారు వెల్లడించిన వివరాలను వ్యవసాయాధికారులు నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి పాండు, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, నర్సింహా, పర్వతాలు, అంజమ్మ, వెంకటేశ్, యశోధ, వెంకట్‌రాంరెడ్డి, పాండురంగారెడ్డి, ఆనంద్, ఎంపీటీసీలు రాములు, మల్లేశ్, ఇందిరా దేవేందర్, ఏఓ లావణ్య, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, మేఘనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, యాదయ్య, గోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జంగయ్య, సీఈఓ యాదగిరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్‌లో గల భూపేష్‌గుప్తానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య, నాయకులు మంతాని యాదయ్య, కె.వెంకటయ్య, పి.శ్రీనివాస్, సంతోష్, వి.బుచ్చమ్మ, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బదిలీకి ఫిర్యాదు

బడంగ్‌పేట్: గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌గా ఏర్పడినప్పటి నుంచి పదేళ్లుగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వంకాలయ యాదగిరిని వేరే చోటకు బదిలీ చేయాలని కోరుతూ మంగళవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు సక్రమంగా నిర్వర్తించకుండా తనకు నచ్చిన కార్పొరేటర్లకు, రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగుసార్లు బదిలీలు అయినా కొందరి నాయకుల అండదండలతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లో డిప్యూటేషన్ వేయించుకుంటున్నారని తెలిపారు. కార్పొరేషన్‌లో పనిచేయని యాదగిరి డిప్యూటేషన్‌ను రద్దు చేసి సొంత పోస్టింగ్ ఎక్కడ ఉందో అక్కడికి పంపించి వేరే వ్యక్తిని బడంగ్‌పేట కార్పొరేషన్‌లో విధులు నిర్వహించేలా చూడాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు.



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన సిప్ అబాకస్ విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: ఇటీవల జరిగిన తెలంగాణ ప్రాంతీయ స్థాయి సిప్ అబాకస్ మెంటల్ అర్థమెటిక్ కాంటెస్ట్ పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా 60 కేంద్రాల నుంచి 2,100 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో కేవలం 11 నిమిషాల్లో 200 లెక్కలు చేయాల్సి ఉంటుంది. ఆర్‌కేపురం వాసవీ కాలనీ సిప్ అబాకస్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 21 ట్రోఫీలు గెలుచుకున్నా రు. ఎం కార్తికేయ (లెవల్7) చాంపియన్‌గా నిలిచారు. ఆస్తిక్, జ్ఞానిరెడ్డి(లెవల్ 1), ఆశిష్ (లెవల్ 4), సీహెచ్ ధీరజ్, పి హరిణి (లెవల్ 5), జి అవ్యక్త్, నాగ విదిత్, సాయి వెన్ను (లెవల్ 3), హవిషా రమణి (లెవల్8), కె వేదాంత్ రెడ్డి (జీఎంబీ) 2వ రన్నరప్‌గా నిలువగా, కె శ్రీతన్‌రెడ్డి (లెవల్ 1), పి శ్రీనిక (లెవల్ 2), వై సహస్ర రెడ్డి, రాజ్ విహాన్ రెడ్డి (లెవల్ 3), ఆదిత్య(లెవల్ 4), కె భవిష్, ఎస్ సాయి, అఖిలేష్ (లెవల్ 5), సి శివానిరెడ్డి(లెవల్ 7), జి అమితేష్‌రెడ్డి (జీఎంసీ) 3వ రన్నరప్‌గా నిలిచారు. మంగళవారం సిప్ అబాకస్ వాసవి కాలనీ కొత్తపేట్ నిర్వాకురాలు సంధ్యారాణి, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

కందుకూరు: ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం మహేశ్వరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్, మండల అధ్యక్షుడు శ్రావణ్ మట్లాడుతూ.. ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీలను పూర్తి స్థాయిలో భర్తీ చేయకుండా అరకొరగా నామమాత్రపు పోస్టులు వేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను వాయిదా వేసి నూతన తేదీలను ప్రకటించాలన్నారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులందరికీ 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, జాబ్ కేలండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బస్వ రఘుగౌడ్, మహేశ్, సుదర్శన్, దేవేందర్, బుర్ర సాయిల్, శివప్రకాశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు నియంత్రించాలి

ప్రగతిశీల సంఘం రాష్ట్ర నాయకులు

మీర్‌పేట: మాదక ద్రవ్యాలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏళ్ల లోపు పిల్లల నుంచి యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మీర్‌పేట పరిధిలో మత్తు పదార్థాల వినియోగం పెరగడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచిస్తూ, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ జి.సైదులు, పీవైఎల్ బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేష్, సహాయ కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

నేడు జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

కందుకూరు: మహేశ్వరం మండల పరిధిలో బుధవారం వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి రానున్నారు. ఉదయం 10 గంటలకు కేసీతండా నుంచి ప్రారంభమై ఆకన్‌పల్లి, పోరండ్ల, సుభాన్‌పూర్, అయ్యవారిపల్లి, నల్లచెరువు తండా, పెద్దమ్మతండా, చిన్నతుప్రా, అమీర్‌పేట గ్రామాల్లో ప లు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు.

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: పల్లెల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సాలార్‌పూర్ గ్రామ పంచాయతీలో రూ.5లక్షల జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎంపీటీసీ ప్రియారమేశ్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పంతునాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్, బాబాకుమార్, రాజు, అంజయ్య, జైపాల్, అనిల్, శ్రీరాములు,, శ్రీను, రమేశ్, ఈశ్వరప్ప తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 40, వంకాయ 35, బెండ 35, పచ్చి మిర్చి 70, కాకర 38, బీర 28, క్యాబేజి 35, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 35, దొండ 15–18, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 27, క్యాప్సికం 70, ఆలు 38, దోస 23, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 35.

బిల్లులు రాక.. అప్పులు తీరక

బాలల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో చిన్నారులు గణనీయంగా బడిబాట పట్టారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ పథకంలో పెండింగ్ బిల్లుల సమస్య కలకలం రేపుతోంది. కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సకాలంలో బిల్లులు అందడం లేదు.

- తీవ్ర అవస్థల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఏడు నెలలుగా పెండింగ్
- యాచారంలో రూ.30 లక్షలకు పైగా బకాయిలు

యాచారం: మధ్యాహ్న భోజనాన్ని అప్పులు చేసి విద్యార్థులకు వండి పెట్టాల్సిన దుస్థితి సిబ్బందికి ఏర్పడింది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. మండలంలోని 24 గ్రామాల్లో పది ఉన్నత, ఒక ఆదర్శ, ఆరు ప్రాథమికోన్నత, 32 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మొత్తం విద్యార్థులు 4,200 మందికి పైగా ఉన్నారు. విద్యార్థులకు బియ్యాన్ని ప్రభుత్వమే అందజేస్తుండగా, కూరగాయలు, గుడ్లు, వంట సిబ్బందికి జీతాలకు సైతం ప్రత్యేకంగా ఇస్తుంది.

అప్పులు చేసి కొంటున్న సరుకులు

మధ్యాహ్న భోజన సిబ్బందికి ఏడు నెలలుగా బిల్లులు అందడం లేదు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో వంట సిబ్బంది అధిక వడ్డీకి అప్పులు చేసి వంట సరుకులు కొంటున్నారు. వంట సిబ్బందికి కూరగాయల కొనుగోలుకు గాను ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రూ.5.45, ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.8.17, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు గాను రూ.10.67 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రతి నెలా కూరగాయలు, గుడ్లకు కలిపి రూ.5 నుంచి రూ.6 లక్షలకు పైగానే ఖర్చు అవుతుంది. ఇలా ఏడు నెలలుగా సిబ్బందికి దాదాపు రూ.30 నుంచి రూ.35 లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల కోసం నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసిన ప్రయోజనం కరువైంది.

గౌరవ వేతనం లేదు

మండలంలోని గునుగల్‌లో ఉన్న ఒక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతారు. మధ్యాహ్న భోజనం వండటానికి మొత్తం 84 మంది సిబ్బంది పనిచేస్తారు. వీరికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నెలకు రూ.మూడు వేల చొప్పున గౌరవ వేతనం అందుతుంది. ఇవి కూడా సక్రమంగా అందడం లేదు. కూరగాయల ఖర్చు, గుడ్లు కొనుగోలుకు అప్పులు చేస్తున్నారు. అయినా సరైన గౌరవం కూడా దక్కడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

బకాయిలు వాస్తవమే



మండలంలోని పలు పాఠశాలలకు మధ్యాహ్న భోజన బిల్లులు బకాయి ఉన్నది వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. త్వరలో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. బియ్యంలో నాణ్యత లేకుంటే వంట సిబ్బంది సమాచారం అందించాలి. – వెంకట్‌రెడ్డి, ఎంఈఓ, యాచారం



చింతపట్లలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది (ఫైల్)